వ్యాధుల కాలం.. జర భద్రం

- భయపెడుతున్న మలేరియా, టైఫాయిడ్, డయేరియా
- అప్రమత్తతతోనే రుగ్మతలను పారదోలాలని వైద్యుల సూచన





కేజీహెచ్ మెడికల్ ఓపీలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

దాబాగార్డెన్స్ : వర్షాకాలం వచ్చేసింది. ఈ సమయంలో వాతావరణ మార్పుల వల్ల సంభవించే సాధారణ వ్యాధులతో పాటు కలుషిత నీరు, అపారిశుధ్యం వల్ల పలు వ్యాధులు దాడి చేస్తాయి. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా మలేరియా, టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే కాలమిది. దోమల వల్ల వ్యాపించే విషజ్వరాలు, నీటి కాలుష్యం వల్ల సంభవించే డయేరియా విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

వర్షాకాలంలో వచ్చే వ్యాధులు..

మలేరియా: దోమకాటు ద్వారా వచ్చే వ్యాధుల్లో మలేరియా ఒకటి. ఈ జ్వరానికి కారణం ప్లాస్మోడియం అనే సూక్ష్మజీవి. రోగి శరీరంలో ఈ సూక్ష్మజీవులుంటాయి. అనాఫిలిస్ జాతికి చెందిన ఆడ దోమ ఈ రోగిని కుట్టి రక్తంతో పాటు సూక్ష్మజీవులను కూడా పీల్చుకుంటుంది. అలాంటి దోమ ఇతర ఆరోగ్యవంతులను మళ్లీ కుట్టినప్పుడు వారికి సంక్రమిస్తుంది. ఈ దోమ మురుగుకాల్వల్లోని మంచినీటిలో వృద్ధి చెందుతాయి.

లక్షణాలివి: దోమ కుట్టిన పది నుంచి 14 రోజుల్లో మలేరియా వ్యాధి లక్షణాలు బయటపడతాయి. రోజు విడిచి రోజు జ్వరం రావడం, తలనొప్పి, ఒంటినొప్పులు, చలి ఎక్కువగా ఉంటుంది. చెమటలు పట్టడం, కొన్నిసార్లు వాంతులు కావడం జరుగుతుంది. జ్వరం వచ్చిన తొలిరోజే మలేరియా నిర్ధారించవచ్చు. మలేరియా లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలి.

డెంగ్యూ : నల్లగా ఉండే ఈ దోమపై తెల్లని మచ్చలు ఉంటాయి. తన శరీరంలోకి డెంగ్యూ వైరస్ ప్రవేశించిన వారం రోజుల తర్వాత దీనిని మనుషులకు వ్యాపింపచేస్తుంది. ఇది కుట్టినప్పుడు నొప్పి ఉండదు. పగటిపూట ఎక్కువగా సంచరించే ఈ దోమ ఆ సమయంలోనే కుడుతుంది. మూతల్లేని నీటి ట్యాంకులు, సిమెంటు, తారు రోడ్లపై నిలిచే నీరు, తాగేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లు, నీటి గాజులు, ఇళ్లలోని రిఫ్రిజిరేటర్లు, కూలర్లలో నిల్వ ఉండే నీటిలో డెంగ్యూ కారక దోమ వృద్ధి చెందుతుంది. దోమ కుట్టిన వారం రోజుల తర్వాత ఆకస్మికంగా తీవ్రమైన జ్వరం, ఎముకలు, కండరాల్లో భరించలేని నొప్పి, కొందరిలో శరీరంపై పొక్కులు వస్తాయి. వాంతులు, వికారం, రక్తంతో కూడిన మల విసర్జన, కడుపునొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి.

డయేరియా.. : కలుషితనీరు, నిల్వ ఆహారం ద్వారా అతిసార వస్తుంది. రోగికి ఒక రోజులో 10 నుంచి 15 సార్లు నీళ్ల విరేచనాలు అవుతాయి. వాంతులు కూడా ఎక్కువ అవుతాయి. రోజులో నాలుగు నుంచి ఐదుసార్లు విరేచనాలు అయితే డయేరియాగా గుర్తించాలి. ఎక్కువ సార్లు విరేచనాలు కావడం వల్ల శరీరంలోని నీరు, లవణాలు, పొటాషియం, గ్లూకోజ్ శాతం తగ్గిపోయి రోగి షాక్‌లోకి వెళ్తాడు. రోగి త్వరగా డీ హైడ్రేషన్ దశకు చేరుతాడు. ఈ వ్యాధి ప్రభావం చిన్నారులు, మధుమేహరోగులు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిపై ఎక్కువగా ఉంటుంది.

వైరల్ ఫీవర్ (విషజ్వరం): వాతావరణంలో మార్పు, కొన్ని రకాల వైరస్‌ల కారణంగా వైరల్ ఫీవర్ వస్తుంది. ఇంట్లో ఒకరికి విషజ్వరం వస్తే మిగిలిన కుటుంబ సభ్యులకు కూడా వచ్చే అవకాశం ఉంది. దీని ప్రభావం వారం నుంచి పది రోజుల పాటు ఉంటుంది. రోగికి 103 నుంచి 107 డిగ్రీల వరకు జ్వరం వస్తుంది. గొంతునొప్పి, జలుబు, ఆకలి మందగించడం, తలనొప్పి, ఒంటినొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొందరికి వాంతులు, విరేచనాలు కూడా అవుతాయి.

అప్రమత్తత అవసరం..



వర్షాకాలంలో సీజనల్‌గా వ్యాపించే మలేరియా, డయేరియా, డెంగ్యూ జ్వరాలపై అప్రమత్తత అవసరం. డయేరియా సోకిన రోగికి చిన్న పిల్లలను దూరంగా ఉంచాలి. లేదంటే వారు కూడా వ్యాధి బారిన పడే ప్రమాదం ఉంది. డయేరియా సోకిన వ్యక్తికి కొబ్బరినీళ్లు, మజ్జిగ తాగించాలి. లీటర్ నీటిలో ఓఆర్ఎస్ ప్యాకెట్ కలిపి 3 నుంచి 4 గంటల వ్యవధిలో తాగించాలి. మంచి నీళ్లు కాచి చల్లార్చి తాగాలి. నిల్వ ఆహార పదార్థాలు తినకూడదు. జ్వర తీవ్రత ఎక్కువగా ఉంటే వైద్యులను సంప్రదించాలి.

ప్రొఫెసర్ డాక్టర్ రాధాకృష్ణ, జనరల్ మెడిసిన్

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- దోమల వల్ల ఎక్కువ వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. కనుక వాటి వ్యాప్తిని అరికట్టే చర్యలు తీసుకోవాలి. ప్రధానంగా నీరు, మురుగు నిల్వ లేకుండా చూసుకోవాలి.
- దోమతెరలు వాడాలి.
- కాచి చల్లార్చిన నీరు తాగాలి.
- చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఏదైనా తినే ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలి.
- తాజా పండ్లు, కూరగాయలు నీటితో శుభ్రంగా కడిగిన తర్వాత తీసుకోవాలి.
- సాధ్యమైనంత వరకు వేడిగా ఉన్నప్పుడే ఆహారం తీసుకోవాలి.
- ఆహార పదార్థాలపై ఎప్పుడూ మూత ఉండేలా చూడాలి.
- జలుబుకారక క్రిములను నివారించే సి విటమిన్ ఉన్న నిమ్మకాయ, బత్తాయి వంటివి తీసుకోవాలి.

క్లుప్తంగా

గెడ్డ ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న రైతులు రమేష్ రాజ్ తదితరులు

సబ్బవరం: పెద్దగెడ్డ ఆక్రమణకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు డిమాండ్ చేశారు. ఆరిపాక రెవెన్యూ పరిధిలో ఆక్రమణకు గురైన గెడ్డవాగు వద్ద రైతులు ఆదివారం నిరసన తెలిపారు. అధికారులు ఆక్రమిత భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారన్నారు. గెడ్డవాగులో ఉన్న విలువైన చెట్లను తొలగించిన వారిపై వాల్టా చట్టం ప్రకారం కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే దీనిపై జిల్లా కలెక్టర్‌తో పాటు రెవెన్యూ,ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. నిరసన కార్యక్రమంలో రైతులు వి. రమేష్ రాజు, గొర్లి వెంకటరమణ,పెంటకోట రామారావు,ఎ పైడంనాయుడు,దంతులూరి సురేష్ వర్మ,ఆడారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మపాలెం మహిళా పోలీస్‌కు సత్కారం



ఉత్తమ ఉమెన్ పోలీస్ జవేరియాను సత్కరిస్తున్న సర్పంచ్ సుజాతముత్యాలు

పరవాడ: ముత్యాలమ్మపాలెంలో ఓ బాలుడి మిస్సింగ్ కేసును చాకచక్యంగా ఛేదించినందుకు ముత్యాలమ్మపాలెం గ్రామ సచివాలయంలో ఉమెన్ పోలీస్‌గా పనిచేస్తున్న షేక్ జవేరియా పోలీసు ఉన్నతాధికారుల నుంచి ప్రశంస అందుకున్నారు. కాగా ఉత్తమ ఉమెన్ పోలీస్‌గా ప్రశంసా పత్రం అందుకున్న జవేరియాను గ్రామ సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు పంచాయతీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి.సోమునాయుడు, మండల కోఆప్షన్ సభ్యుడు మైలపల్లి అప్పన్న, మాజీ కోఆపరేటివ్ డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

25న జిల్లా స్థాయి యోగా పోటీలు

పరవాడ: యోగాసన స్పోర్ట్స్ అసోషియేషన్ అనకాపల్లి జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 25న వెన్నలపాలెం కల్యాణ మండపంలో జిల్లా స్థాయి యోగాసన పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోషియేషన్ కార్యదర్శి సీహెచ్.ఆంజనేయులు చెప్పారు. ఈ పోటీల్లో సబ్ జూనియర్ 9 నుంచి 14 ఏళ్లు, జూనియర్ 14 నుంచి 18 ఏళ్లు, సీనియర్ కేటగిరిలో 18 నుంచి 28 ఏళ్ల బాలబాలికలు అర్హులని తెలిపారు. ట్రెడిషినల్, ఆర్టిస్టిక్, రిథిమిక్ విభాగాల్లో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లా స్థాయి విజేతలు ఆగస్టులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని చెప్పారు. అక్కడ ప్రతిభ చూపిన కేలో ఇండియా పోటీలకు అర్హత సాధిస్తారన్నారని తెలిపారు. పూర్తి వివరాలకు 9701658665 నంబర్‌లో సంప్రదించాలని ఆంజనేయులు కోరారు.

గంగవరం పోర్టు కార్మికులకు న్యాయం చేయాలి



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న మణి

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న నిర్వాసిత కార్మికులకు న్యాయం చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షురాలు పి.మణి డిమాండ్ చేశారు. గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన వద్ద చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షా శిబిరాన్ని సీఐటీయూ నాయకులతో కలిసి ఆదివారం ఆమె సందర్శించారు. నిర్వాసిత కార్మికుల ఆందోళనకు మద్దతు తెలిపారు. అనంతరం మణి మాట్లాడుతూ గంగవరం పోర్టు నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన వారికి అన్యాయం చేయడం సరికాదన్నారు. జీతాలు పెంచాలని కోరిన కార్మికులను ఉద్యోగాల నుంచి ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలన్నారు. యాజమాన్యం దిగివచ్చి కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నొల్లి తాతారావు, కొవిరి అప్పలరాజు, వాసుపల్లి ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

● సరదాగా..



కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదివారం కుటుంబ సమేతంగా తిక్కవాని పాలెం తీర ప్రాంతాన్ని సందర్శించారు. సింహాద్రి ఎన్టీపీసీ ఏర్పాటు చేసిన అతి పొడవైన జెట్టీపై కొంత సేపు గడిపారు. జెట్టీ సమీపంలో ఏర్పాటు చేసిన పార్క్‌లో కుటుంబ సభ్యులతో కాసేపు గడిపి అల్పాహారం తీసుకున్నారు. అనంతరం తీరం అందాలను ఆస్వాదించారు. కలెక్టర్ వెంట సింహాద్రి ఎన్టీపీసీ అధికారులు ఉన్నారు. - పరవాడ

నేడు రెండు గ్రామాల్లో 'జగనన్న సురక్ష'

సబ్బవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మండలంలోని నారపాడు, బాటజంగాలపాలెం గ్రామ సచివాలయాల్లో సోమవారం నిర్వహించనున్నట్లు మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు.ఆయనతో పాటు ఎంపీపీ బోకం సూర్యకుమారి,జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు హాజరవుతారు.కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రజా సమస్యలు తెలుసుకోవడంతో పాటు ఆయన చేతుల మీదుగా పలు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారని పేర్కొన్నారు.

250 మందికి వైద్య పరీక్షలు



చిన్నారికి సర్టిఫికెట్, మొక్క అందజేస్తున్న డాక్టర్ ఎన్.ఎల్.రావు తదితరులు

సింహాచలం: మానసిక ఆనందంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని రాష్ట్ర ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ ప్రాక్టీసనర్స్ అసోసియేషన్ సలహాదారు డాక్టర్ ఎన్.ఎల్.రావు తెలిపారు. పురుషోత్తపురంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఆదివారం జేసీఐ వైజాగ్ యువ, జెకాం విశాఖపట్నం ఎల్-2.0 సంయుక్తంగా ఆనందం-ఆరోగ్యం మహా మేళా నిర్వహించారు. డాక్టర్ ఎన్.ఎల్ రావు మాట్లాడుతూ మానవ జీవన శైలిలో లలిత కళలు ఒక భాగం కావాలన్నారు. మహా మేళా ప్రోగ్రాం చైర్మన్ కె.ఎం.కె. రమేష్ మాట్లాడుతా బాల్యం నుంచి ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవాటు చే లనే ఉద్దేశంతోనే ఆనందం-ఆరోగ్యం కార్యక్రమాన్ని రూపొందించామని తెలిపారు. ఈ సందర్భంగా పిల్లలకు, మహిళలకు చిత్రలేఖనం, మట్టితో బొమ్మల తయారీలో శిక్షణ ఇచ్చారు. అనంతరం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వీ డెంటల్ ఆధ్వర్యంలో 250 మందికి ఉచితంగా వైద్య సేవలు అందించారు. ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు, మారుతి, మాధవి డాక్టర్ ఫరూఖ్, కె.పృథ్వీరాజ్, కె.రమ్య, హరిబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సెక్షన్-1 పరిధిలోని 11కేవీ సబ్బవరం రూరల్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్. రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనితో సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ మండలంలోని ఇరువాడ,అసకపల్లి,పైడివాడ అగ్రహారం,పెదగొల్లలపాలెం,తవ్వవానిపాలెం,అమృతపురం,గాలిభీమవరం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రోడ్డు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



బంటాకాలనీలో రోడ్డు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే అదీప్ రాజ్, కో ఆప్షన్ సభ్యుడు బెహరా

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు బంటాకాలనీలో రోడ్డు, కాల్వల పనులకు ఆదివారం పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు శంకుస్థాపన చేశారు. సుమారు రూ.7లక్షల జీవీఎంసీ నిధులతో ఈ పనులు చేపడుతున్నామని తెలిపారు. ఎమ్మెల్యే అదీప్ రాజ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. కోవిడ్ కష్టాలను అధిగమించి అభివృద్ధిపై పూర్తిగా దృష్టి పెట్టారని చెప్పారు. కార్యక్రమంలో 92వ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, నగర అధికార ప్రతినిధి యతిరాజుల నాగేశ్వరరావు, నాయకులు కంచిపాటి జగదీష్, శంకరరావు, షేక్ వల్లి, ఊటపల్లి గోవిందరావు, ఏఈ వెంకటలక్ష్మి, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ట్రోఫీ ఆవిష్కరణ



ట్రోఫీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెదగంట్యాడ: క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పెందుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. జీవీఎంసీ 77వ వార్డు నమ్మిదొడ్డి జంక్షన్‌లో నిర్వహిస్తున్న ఏసీసీ ఐపీఎల్ సీజన్-4 క్రికెట్ టోర్నమెంట్ ట్రోఫీని, క్రీడాకారుల జెర్సీలను, ఆదివారం ఆయన ఆవిష్కరించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తన వంతు సాయం కింద రూ.60 వేలతో జెర్సీలను అదీప్‌రాజ్ అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, నాయకులు శివకుమార్, ఎంపీ రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

సింహాచలేశుడికి వైభవంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠంప జేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి నిర్వహించారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ సూపరింటిండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తు లు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంప జేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం , కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

కుక్క దాడిలో ఇద్దరికి గాయాలు



ఆస్పత్రిలో రితిక్‌ను పరామర్శిస్తున్న కార్పొరేటర్ ముమ్మన

సింహాచలం: జీవీఎంసీ 95వ వార్డు పరిధిలోని పోర్లుపాలెంలో వీధి కుక్క ఇద్దరిపై దాడిచేసి గాయపరిచింది. వివరాలు.. చీమాలాపల్లిలో రితిక్(5)ఇంటి బయట మిగతా పిల్లలతో కలిసి ఆడుకుంటున్నాడు. వీధి కుక్క ఒక్కసారిగా దాడి చేసి రితిక్‌ను తీవ్రంగా గాయపరిచింది. దీంతో మిగతా పిల్లలు పారిపోయారు. రితిక్‌ను కాపాడేందుకు నాగరాజు అనే వ్యక్తి పూనుకోగా అతన్ని కూడా కుక్క గాయపరిచింది. వెంటనే వారిని గోపాలపట్నంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. కాగా గాయపడిన బాలుడిని 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. బాలుడికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

'ఉక్కు' ప్రైవేటీకరణతో కార్మికుల భవిష్యత్తు అంధకారం

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణతో కార్మికులు, ఉక్కు నిర్వాసితుల భవిష్యత్తు అంధకారంగా మారిందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు ఆదివారంతో 885వ రోజుకు చేరుకున్నాయి. స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొండ తాడన్న, ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకుంటేనే దేశ భవిష్యత్తు బాగుంటుందన్నారు. ఎన్నో ఏళ్లుగా కార్మికులు ఆహోరాత్రులు శ్రమించి స్టీల్‌ప్లాంట్ ఆస్తులను దేశంలో అగ్రగామిగా నిలిపితే, నేడు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయాలని అనుకోవడం దుర్మార్గమైన చర్యన్నారు. కార్మికుల హక్కులు, సదుపాయాలు కొనసాగాలంటే స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగంలోనే కొనసాగాలని, అంతవరకు ఉద్యమిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.బొడ్డు పైడిరాజు, ఎస్.రామారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

లుంబినీ పార్కులో బుద్ధ వందనం

ఎంవీపీ కాలనీ: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని అప్పుఘర్ దరి లుంబినీ పార్కులోని బుద్ధుడి విగ్రహానికి పలువురు బుద్ధ వందనం సమర్పించారు. బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం బోర వేణుగోపాల్ హాజరైన వారితో బుద్ధవందనం చేయించారు. ఈ సందర్భంగా మల్లయ్యరాజు మాట్లాడుతూ ప్రపంచ శాంతికి బౌద్ధ ధర్మమే శరణ్యం అన్నారు. బుద్ధుడి బోధనలు ప్రతి ఒక్కరూ ఆచరిస్తే సమాజంలో సమ సమానత్వం, శాంతి వెల్లువిరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పెయ్యిల సిద్ధార్థ, బత్తుల గౌతం బాబూ, అన్నవరం, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న లలిత

దాబాగార్డెన్స్ : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీ సంఘాల నాయకులతో చర్చించి వారికి న్యాయం చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ అనుబంధ సంస్థ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె. లలిత కోరారు. అసోసియేషన్ విశాఖ, విజయనగరం ఉమ్మడి జిల్లాల సదస్సు ఆదివారం అల్లిపురంలో గల నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు అతి తక్కువ గౌరవ వేతనాలకు పని చేస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు విజయవంతం చేసేందుకు నిత్యం గ్రామీణ, పట్టణ నిరుపేద కుటుంబాలు, గర్భవతులు, బాలింతలకు, సున్నా నుంచి ఆరేళ్ల పిల్లల వరకు సేవలందిస్తున్నారని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ భారమై అప్పులు తెచ్చి కేంద్రాలు నిర్వహించాల్సిన స్థితి ఏర్పడుతుందన్నారు. అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అసోసియేషన్లను ఆహ్వానించి, చర్చించి మంచి వేతనాలు అమలు చేయాలని, ఈఎస్ఐ, పెన్షన్, ఇన్సూరెన్స్ అమలు చేయాలని, విధుల్లో చనిపోయిన వారికి రూ. ఐదు లక్షలు ఇవ్వాలని, వారి ఇంటిలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ విజయనగరం జిల్లా నాయకుడు డేగల అప్పలరాజు, మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు బేగం తదితరులు పాల్గొన్నారు.

రెండు జిల్లాల నూతన కమిటీ..

సమావేశం అనంతరం విశాఖ, విజయనగరం ఉమ్మడి జిల్లాల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విశాఖ జిల్లా అధ్యక్షురాలిగా అనిత, ఉపాధ్యక్షురాలిగా వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా అనురాధ, సహాయ కార్యదర్శిగా అరుణ, కోశాధికారిగా నరసయ్యమ్మ, కమిటీ సభ్యులుగా కుమారి, విజయ, కొండమ్మ, సీతను ఎన్నుకున్నారు. విజయనగరం జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఈగల అప్పలరాజు, అధ్యక్షురాలిగా రమణి, ఉపాధ్యక్షురాలిగా మణి, కార్యదర్శిగా మాణిక్యం, సహాయ కార్యదర్శిగా సుశీల, కోశాధికారిగా రమణ, సభ్యులుగా కుమారి, సరోజిని, యశోద, కనక మహాలక్ష్మి, హైమావతి తదితరులను ఎన్నుకున్నారు.